www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 30 జులై 2024

మహిళలపై అత్యాచారాలు అరికట్టండి : ఐద్వా

ప్రజాశక్తి - ఆకివీడు

మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులను అరికట్టాలని ఐద్వా పట్టణ అధ్యక్షురాలు డోకల లక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎస్ఐ బి.నాగబాబుకు ఐద్వా నేతలు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డోకల లక్ష్మి మాట్లాడుతూ ఇటీవల కాలంలో రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో మహిళలపై, బాలికలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయన్నారు. వాటిని నియంత్రించేందుకు చట్టాలు కఠినంగా అమలు చేయాలని కోరారు. యువత పెడదారి పట్టడానికి కేవలం గంజాయి, మద్యం మాత్రమే కారణమన్నారు. గంజాయి సరఫరా దారులను ఉక్కుపాదంతో అణచివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్ఐ నాగబాబు మాట్లాడుతూ అల్లరి మూకలను అదుపు చేసేందుకు ఇప్పటికే చర్యలు తీసుకుంటున్నామన్నారు. మహిళలకు అవగాహనా సదస్సులు ఏర్పాటుచేస్తే తాము సహకరిస్తామని ఎస్ఐ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఐద్వా నేతలు జివి.లావణ్య, జి.రాణి, బి.కళ్యాణి, పి.కృష్ణవేణి పాల్గొన్నారు.

నిలకడగా గోదావరి వరద

లంకలను వీడని ముంపు

భీమలాపురంలో ఇంటిని చుట్టుముట్టిన వరద

ప్రజాశక్తి - ఆచంట

మండలంలోని లంక గ్రామాల్లో గోదావరి వరద సోమవారం నిలకడగా ఉంది. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వరద ఉధృతి క్రమేపీ రెండు అడుగుల మేర పెరిగి ఆపై నిలకడగా ఉంది. లంక గ్రామాలు జలదిగ్బంధంలోనే కొనసాగుతున్నాయి. గోదావరిపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి వీల్లేని పరిస్థితి లంక గ్రామాల్లో నెలకొంది. ఎగువ నుంచి వస్తున్న వరద నీరు లంక గ్రామాలను చుట్టుముట్టింది. అయోధ్యలంక పరిధిలోని మర్రిమూల, పుచ్చల్లంక, రాయిలంక గ్రామాల్లో పల్లపు ప్రాంతాలకు వరద నీరు చేరింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న వారు సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. మరోపక్క ఏటిగట్టు పరివాహక గ్రామాలైన పెద్దమల్లం, కోడేరు, కరుగోరుమిల్లి, భీమలాపురంలో ఎడమవైపు ఉన్న లంక భూముల్లోకి వరద నీరు చేరింది. దీంతో ఆయా ప్రాంతాల రైతులు అప్రమత్తమయ్యారు. భీమలాపురం పంచాయతీ పరిధి కాపులపాలెన్ని వరద నీరు చుట్టుముట్టింది. దీంతో ప్రధాన రహదారిపై వరద నీరు వేగంగా ప్రవహిస్తోంది. పలు ఇళ్ల నీటిలో నానుతున్నాయి. గోదావరి తీరంలోని మాచేనమ్మ ఆలయ ప్రాంగణంలో వరద నీరు ప్రవేశించింది. పెదమల్లంలోని పర్యాటక కేంద్రం చుట్టూ నీరు చేరింది. పుష్కర ఘాట్లు పూర్తిగా నీట మునిగాయి. గోదావరి ఉధృతంగా ప్రవహించడంతో నదిని తిలకించేందుకు వస్తున్న సందర్శకుల సంఖ్య బాగా పెరిగింది. ఎగువ ప్రాంతాల్లో వరద కొంతమేర తగ్గినా మండలంలో మాత్రం రెండు అడుగులు పెరిగి నిలకడగా ఉంది.

యలమంచిలి: గోదావరి వరద నిలకడగా ఉంది. భద్రాచలం వద్ద వరద తగ్గుముఖం పట్టినా.. ధవళేశ్వరం బ్యారేజీ నుండి దిగువ ప్రాంతాలకు భారీగా వరద నీటిని విడుదల చేస్తుండటంతో దాని ప్రభావంతో వరద నిలకడగా కొనసాగుతోంది. దీంతో లంక గ్రామాలు ముంపులోనే ఉన్నాయి. కనకాయలంకవాసులు పడవల్లోనే రాకపోకలు సాగిస్తున్నారు. దొడ్డిపట్ల పల్లిపాలెం, లక్ష్మీపాలెం, యలమంచిలి లంక, బాడవ, పెదలంక గ్రామాల్లోని ఇళ్ల చుట్టూ వరద నీరు చుట్టుముట్టడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇళ్ల నుండి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది.

కనకాయలంకలో కొబ్బరి తోటల్లో కొనసాగుతున్న వరద నీరు

రైతు కంట కన్నీరు..!

- వారం రోజులుగా ముంపులోనే పొలాలు
- రెండు జిల్లాల్లో 33 వేల ఎకరాల్లో నాట్లు, 1700 ఎకరాల్లో నారుమళ్లు మునక
- పశ్చిమలో అత్యధికంగా 30 వేల ఎకరాల్లో ముంపులోనే నాట్లు
- ఎకరాకు రూ.15 వేలు వరకూ అన్నదాతకు నష్టం
- కౌలురైతులకు నష్ట పరిహారం అందించేనా?
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



ఉంగుటూరు మండలం కాకర్లమూడి గ్రామంలో ఇంకా ముంపులోనే ఉన్న పంటపొలాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఖరీఫ్ సాగులో ఆదిలోనే అన్నదాతను కష్టాలు చుట్టుముట్టాయి. వరదలకు నాట్లు నాటిన పొలాలు, నారుమడులు నీట మునిగి దెబ్బతినడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. వారం రోజులుగా పొలాలు ముంపులోనే ఉండటంతో పూర్తిస్థాయిలో దెబ్బతినే పరిస్థితి నెలకొంది. దీంతో ఖరీఫ్ సాగు ఆదిలోనే నష్టాలను మిగిల్చింది. వరదలకు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో భారీగా పంటనష్టం వాటిల్లింది. వరద తగ్గుముఖం పట్టినా ఇంకా ముంపులోనే పొలాలు ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో వ్యవసాయ అధికారుల లెక్కల ప్రకారం 29,505 ఎకరాల్లో నాట్లు ముంపునకు గురవ్వగా, 1450 ఎకరాల్లోని నారుమళ్లు నీట మునిగాయి. ఏలూరు జిల్లాలో 3,442 ఎకరాల్లో నాట్లు, 245 ఎకరాల్లో నారుమడులు ముంపులోనే నానుతున్నాయి. దుక్కు, విత్తనాలు, నాట్లు నాటిన కూలీల ఖర్చు ఇలా ఎకరాకు రూ.15 వేలకుపైగా రైతులు పెట్టుబడులు పెట్టారు. రెండెకరాలు సాగు చేసిన రైతుకు రూ.30 వేల నుంచి రూ.40 వేలు, నాలుగెకరాలు సాగు చేసిన రైతుకు రూ.60 వేల నుంచి రూ.70 వేలు వరకూ నష్టం వాటిల్లే పరిస్థితి నెలకొంది. ఆదిలోనే పంట పొలాలు మునిగి దెబ్బతినడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గోదావరి వరద కొంత తగ్గుముఖం పడుతోంది. పూర్తిస్థాయిలో వరద నీరు తగ్గడానికి మరో నాలుగు రోజులు పట్టే పరిస్థితి ఉంది. ముంపులోని పొలాలు పనికిరాకుండా పోయే పరిస్థితి ఏర్పడటంతో ఖరీఫ్ సాగును ఏవిధంగా ముందుకు తీసుకెళ్లాలో రైతులకు అర్థం కావడం లేదు. తిరిగి నారుమడులు వేసి నాట్లు నాటేందుకు దాదాపు మరో నెలరోజులు పట్టే అవకాశం ఉంది. ఆగస్టు నెలలోనూ వరదలు వచ్చే ప్రమాదం పొంచి ఉంది. మరోసారి వరదలు వస్తే పరిస్థితి ఏమిటనే భయం రైతులను వెంటాడుతోంది. ఉంగుటూరు మండలం కాకర్లమూడిలో వరద నీరుకు నారుమడులు దెబ్బతిన్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఇంకా ముంపులోనే ఉన్నాయి. వరద తగ్గిన ప్రాంతాల్లో మరోసారి నారుమడులు వేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. నాట్లు, నారుమడులు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం పరిహారం ఇస్తుందా అనే అనుమానం సైతం నెలకొంది. 33 శాతం పంట దెబ్బతింటే తప్ప పరిహారం ఇవ్వడం లేదు. నాట్లు, నారుమడులకు సంబంధించి నష్టపరిహారం ఏవిధంగా లెక్కిస్తారో తెలియని పరిస్థితి ఉంది. ముఖ్యంగా పశ్చిమగోదావరి జిల్లాలోని డెల్టా ప్రాంతంలో పంట నష్టం ఎక్కువగా ఉంది. ఒకవైపు గోదావరి, మరోవైపు ఎర్రకాలువ, ఇంకోవైపు గోస్తనీ వరదలతో భారీగా పొలాలు ముంపునకు గురయ్యాయి.

కౌలురైతులకు పంట నష్టపరిహారం అందేనా..?

రెండు జిల్లాల్లో ఖరీఫ్ సాగులో 70 శాతం కౌలురైతులే చేస్తున్నారు. వరదలకు పంట నష్టపోయిన వారిలో అత్యధికంగా కౌలురైతులే ఉన్నారు. వాస్తవ సాగుదారుడైన కౌలురైతులకు పంట నష్టపరిహారం అందేనా అనే అనుమానాలు నెలకొన్నాయి. కౌలుకార్డుల జారీ ప్రక్రియ ఆలస్యం కావడంతో రెండు జిల్లాల్లో ఇప్పటికే కార్డుల జారీ సక్రమంగా జరగలేదు. పంట నష్ట పరిహారంలో కౌలుకార్డులు ప్రధానంగా పరిగణిస్తే కౌలురైతుల పరిస్థితి ఏమిటనే చర్చ రైతుల్లో నెలకొంది. ఎకరాకు రూ.15 వేలకుపైగా నష్టపోయిన కౌలురైతులకు పరిహారం ఇవ్వకపోతే ఆర్థికంగా తీవ్రంగా దెబ్బతినే పరిస్థితి ఉంది. దెబ్బతిన్న పంటల స్థానంలో మళ్లీ నారుమడులు వేసి ఖరీఫ్ సాగు చేయాలంటే అదనపు పెట్టుబడి పెట్టాల్సి ఉంది. దీంతో కౌలురైతులు రెండు విధాలుగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఆదుకుంటేనే కౌలురైతులకు న్యాయం జరిగే పరిస్థితి ఉంటుంది. ప్రతియేటా దెబ్బతిన్న పంటలకు సంబంధించిన పరిహారం, బీమా వంటి ఏ ఒక్కటీ కౌలురైతులకు అందడం లేదు. కూటమి ప్రభుత్వమైనా కౌలురైతులకు న్యాయం చేయాలని అంతా కోరుతున్నారు.

ఇసుక ఉచితమే.. ఛార్జీలే చెల్లించాలి

- నిర్వహణా ఖర్చుల నిమిత్తం రూ.265 చెల్లిస్తే చాలు
- రవాణాకు కిలోమీటర్‌కు రూ.125 చెల్లించేందుకు టిప్పర్ల యజమానులతో ఒప్పందం
- జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ఇసుక ఉచితమేనని, నిర్వహణా ఛార్జీలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. స్థానిక కలెక్టరేట్లో సోమవారం జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ నాగరాణి అధ్యక్షతన ఎస్పి అద్నాన్ నయీమ్ అస్మితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కమిటీ ఖరారు చేసిన ఛార్జీలను మాత్రమే వసూలు చేయాలన్నారు. జిల్లాలో ఇసుక అందుబాటులో లేదని, తూర్పుగోదావరి జిల్లా రావులపాలెం, మందలపర్రు, పెండ్యాల స్టాక్ పాయింట్ నుండి కొనుగోలు చేయాల్సి ఉందని తెలిపారు. జిల్లాలోని డీసిల్టింగ్ పాయింట్లకు పర్యావరణ అనుమతుల కోసం ప్రతిపాదనలు సమర్పించామన్నారు. జిల్లాలోని టిప్పర్స్ ఓనర్స్ అసోసియేషన్‌తో సమావేశమై ఇసుక రవాణాకు సంబంధించి ధర నిర్ణయంపై సమీక్షించారు. వినియోగదారుడికి ఇసుకను అందుబాటులో ఉండేలా రవాణా ఛార్జీల్లో వెసులుబాటుకు టిప్పర్ల యజమానులు ఆలోచన చేయాలన్నారు. రావులపాలెం స్టాక్ పాయింట్ వద్ద రూ.265గా నిర్వహణా ఛార్జీలు నిర్ణయించారన్నారు. పది టైర్ల టిప్పర్ 20 టన్నులు ఇసుకను రవాణా చేసేందుకు కిలోమీటర్ ఒక్కింటికి రూ.125 చొప్పున చెల్లించేందుకు టిప్పర్ల యజమానులను కలెక్టర్ ఒప్పించారు. ఉచితంగా అందరికీ అందించాలనే ప్రభుత్వ లక్ష్యానికి మీ వంతు సహకారం అందించాలని వారిని కలెక్టర్ కోరారు. జిల్లా ఎస్పి అద్నాన్ నయీమ్ అస్మి మాట్లాడుతూ స్టాక్ పాయింట్ వద్ద ఇసుకను తీసుకోవడానికి ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 వరకు వాహనాలకు అనుమతి ఉంటుందని తెలిపారు. వెయిటింగ్ ఛార్జీలు లేకుండా నిర్ణయించిన ధరకే వినియోగదారునికి ఇసుక రవాణా చేసి అందించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఒ జె.ఉదయభాస్కరరావు, అడిషనల్ స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఎటివి.రవికుమార్, ఆర్‌డిఒ కె.శ్రీనివాసుల రాజు, జిల్లా గనులు భూగర్భ శాఖ అధికారి జి.జయప్రసాద్, గోదావరి రివర్ కన్జర్వేటర్ అండ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు, జిల్లా రవాణా అధికారి ఉమామహేశ్వరరావు, ఎపి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ ఎస్.రమేష్, డిపిఒ ఆర్.విక్టర్, ఆర్‌డబ్ల్యుఎస్ జిల్లా అధికారి బివివి.నాగేశ్వరరావు, ఎంవిఐలు, టిప్పర్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రావూరి రాజారావు, భీమవరం యూనియన్ అధ్యక్షులు ఎస్.శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

పోషకాహార గార్డెన్లను అభివృద్ధి చేయాలి

జిల్లాలోని అన్ని పాఠశాలల్లో పోషకాహార గార్డెన్లను అభివృద్ధి చేయాలని, తద్వారా ఉద్యాన పంటల సాగుపై విద్యార్థుల్లో అవగాహన పెరుగుతుందని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ, ఉద్యానవన శాఖ, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రతినిధులతో కన్వర్జెన్స్ సమావేశాన్ని, పిఎం పోషణ్ (మధ్యాహ్న భోజన) పథకం అమలుపై సంబంధిత స్టీరింగ్‌కమ్ మానిటరింగ్ కమిటీ సభ్యులతో సమావేశాన్ని ఆమె నిర్వహించారు. పోషకాహార గార్డెన్లను ఎలా అభివృద్ధి చేయాలో విద్యార్థులకు స్వయంగా నేర్పించాలన్నారు. దీనికి పాఠశాలలను గుర్తించాలన్నారు. జిల్లాలో 950 పాఠశాలలకు ప్రహరీలు ఉండి న్యూట్రిషన్ గార్డెన్స్ ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నవాటిని గుర్తించారన్నారు. ఆయా పాఠశాలల్లో త్వరలో స్కూల్ న్యూట్రిషన్ గార్డెన్స్ ఏర్పాటుకు చర్యలు చేపడతారన్నారు. మధ్యాహ్న భోజన పథకం కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఒ జె.ఉదయభాస్కరరావు, జిల్లా గ్రామ వార్డు సచివాలయ అధికారి కెసిహెచ్.అప్పారావు, డిఇఒ జి.నాగమణి, డిఎంహెచ్ఒ డాక్టర్ డి.మహేశ్వరరావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి శోభారాణి, జిల్లా షెడ్యూల్ కులాల అధికారి పుష్పరాణి, జిల్లా బిసి సంక్షేమ శాఖాధికారి గణపతిరావు, సివిల్ సప్లయీస్ డిఎం టి.శివరామకృష్ణ, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, జిల్లా పౌరసరఫరాల అధికారి ఎన్.సరోజ, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విస్మరిస్తే క్రాప్ హాలిడేనే

రొయ్యరైతుల సంక్షేమ సంఘం

ప్రజాశక్తి - వీరవాసరం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కంపెనీలు రొయ్యలసాగు చేసే రైతుల సమస్యలను విస్మరిస్తే క్రాప్‌హాలిడే ప్రకటిస్తామని రొయ్య రైతుల సంక్షేమ సంఘం నాయకులు హెచ్చరించారు. సోమవారం వీరవాసరం మండల రొయ్యరైతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రొయ్యల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశం నిర్వహించారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రటించినట్లుగానే రాష్ట్ర ప్రభుత్వం కూడా బడ్జెట్‌లో రైతులకు ప్రాధన్యతివ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుండి వచ్చిన రొయ్యసాగు రైతు నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రొయ్యల సాగుకు ఏ రాయితీలు ప్రకటించినా అవి నేరుగా రైతులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బడ్జెట్‌లో ప్రటించిన నాడే బంగారం రేటు తగ్గిందిగాని, రొయ్య మేత ధర ఎందుకు తగ్గలేదో కేంద్ర ప్రభుత్వం ఆలోచించాలన్నారు. సాగుకు అవసరమైన మేత, మందులు దిగుమతి సుంకం తగ్గించినప్పటికీ ఆ ఫలితం ఇంకా రైతులకు అందలేదన్నారు. అఖిలభారత రొయ్య రైతుల సమాఖ్య అధ్యక్షుడు ఐపిఆర్‌మోహన్‌రాజు ఇటీవల ఇచ్చిన ఒక ప్రకటనతో రైతులకు ఇబ్బందికర పరిస్థితులు ఉత్పన్నమవుతాయన్నారు. గతంలో కూడా ఆయన రైతులకు నష్టకలిగే విధంగా ప్రకటనలు చేశారన్నారు. త్వరలోనే అన్ని సంఘాల రైతులను కలుపుకుని ఒక సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకుంటామన్నారు. కేంద్ర ప్రభుత్వం తగ్గించిన దిగుమతి సుంకాన్ని రైతులకు లబ్ధిచేకూరే విధంగా తక్షణమే అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా రొయ్య రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. సమావేశంలో ఆయా సంఘాల నేతలు మళ్ల రాంబాబు, గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు, జికె.సుబ్బరాజు, భోగిరెడ్డి శ్రీనివాసరావు, మళ్ల శ్రీరామ్మూర్తి, మన్నె శ్రీనివాస్, వీరవల్లి చంద్రశేఖర్, గుండా నరసింహరావు, యరకరాజు హరిబాబు, యరకరాజు గోపాలకృష్ణంరాజు, సజ్జన బుజ్జి, యవరాజు పాల్గొన్నారు.

గోదావరి పోటు ప్రభావాన్ని నివారించాలి

కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు

ప్రజాశక్తి - యలమంచిలి

వడ్డిలంక స్లూయిస్ తలుపుల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం వల్ల యలమంచిలి, పోడూరు, ఆచంట మండలాల్లో పంట పొలాలు ముంపునకు గురయ్యాయని ఎపి కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు విమర్శించారు. గోదావరి ముంపు సమస్యపై సంఘం ఆధ్వర్యంలో కట్టుకాలువ, వడ్డిలంక, గుంపర్రు, కాంభొట్లపాలెం, కోనేరుగట్టు, వద్దిపర్రు, రావిపాడు, వల్లూరు గ్రామాల్లో సోమవారం ఆ సంఘం నేతలు పర్యటించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ నక్కల కాలువపై వడ్డిలంక వద్ద స్లూయిస్ తలుపులు ఆధునికీకరించాలని జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు.

ప్రస్తుత గోదావరి వరద పోటుకి స్లూయిస్ కింద వరుసలోని రెండో తలుపు ఊడిపోయిందని తెలిపారు. దీంతో వేలాది ఎకరాల్లో వరిపంట, ఆక్వా చెరువులు మునిగిపోవడంతోపాటు వద్దిపర్రు, కట్టుకాలువ, వడ్డిలంక, కాంభొట్లపాలెం, గుంపర్రు, కోనేరుగట్టు, నార్నిమెరక అనేక గ్రామాల్లో పొలాలు ముంపునకు గురయ్యాయన్నారు. తక్షణం స్లూయిస్ వద్ద వరద పోటు అరికట్టేందుకు తలుపు ఊడిపోయిన లాకుకి అడ్డంగా ఇనుప రేకులు అడ్డు పెట్టేలా ఒఎన్‌జిసి అధికారులతో మాట్లాడాలని సంబంధిత ఎఇ దుర్గారావును కోరారు. దీనిపై ఎఇ స్పందించి మాట్లాడుతూ సమస్యను డ్రెయినేజీ ఇఇ దృష్టిలో పెడతామన్నారు. తక్షణం ముంపు సమస్యను అరికట్టాలని, వరి, కాయగూరలు, ఆక్వా చెరువులు దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారం ఇవ్వాలని రామాంజనేయులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పల్లి జార్జిబాబు, జడ్డు బద్రినారాయణ, రైతులు పొన్నమండ నాగరాజు, ఏడిద శ్రీనివాస్, చెల్లబోయిన నాగాంజనేయులు, వై.కేశవరావు, రుద్రరాజు విశ్వనాథరాజు, తిరుమాని శ్రీనివాస్, శీలబోయిన నాగేశ్వరరావు, కడలి సత్యనారాయణ పాల్గొన్నారు.

సంస్కరణలతో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తం

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

విద్యారంగంలో నెలకొన్న సమస్యలు తక్షణం పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సోమవారం యుటిఎఫ్ ఆధ్వర్యాన డిఇఒకు అందజేశారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ విద్యారంగ సంస్కరణల ఫలితంగా విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు విశ్వాసం సడలిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పాఠశాలలు నిర్వీర్యమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి ఎన్ . వి జ య ం రా వ ు రా జు, ఎకెవి.రామభద్రం మాట్లాడుతూ వివిధ మేనేజ్‌మెంట్లలో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. పెరిగిన పని భారంతోపాటు సమస్యలు పరిష్కారం కాకపోగా ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. తక్షణం సమస్యలు పరిష్కరించి విద్యారంగాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శులు రామకృష్ణ ప్రసాద్, పి.క్రాంతికుమార్, జి.రామకృష్ణంరాజు, డిఎస్.బాబు, సిహెచ్.కుమార్ బాబ్జి, టి.జయకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నేతలు

వసతుల కల్పనలో జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యం : నిమ్మల

యలమంచిలి: దొడ్డిపట్లలోని గోదావరి ఏటిగట్టు కాలనీలో మౌలిక వసతుల కల్పనలో జగన్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహించిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పేదలు, అగ్నికుల క్షత్రియులు అంటే జగన్‌కు కక్ష అని అన్నారు. దొడ్డిపట్లలో గోదావరి ఏటిగట్టు వరద ముంపు బాధితుల ప్రాంతాన్ని మంత్రి రామానాయుడు సోమవారం పరిశీలించారు. బాధిత కుటుంబాలకు 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ హయాంలో ఏటిగట్టు ప్రాంతంలో నివశిస్తున్న పేదలు, అగ్నికుల క్షత్రియులకు ఇళ్ల స్థలాలిచ్చామని, గత వైసిపి పాలనలో ఇంటి నిర్మాణానికి రుణాలందకపోవడంతో డ్రెయిన్లు, వీధిదీపాలు, రహదారులు వంటి కనీస సదుపాయాలకు నోచుకోలేదన్నారు. రానున్న కాలంలో అన్ని వసతులతో మోడల్ కాలనీగా తీర్చిదిద్దే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. ఏటిగట్టు పటిష్టతకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. కార్యక్రమంలో బోణం నాని, గుబ్బల మోహన్, డేగల సత్యనారాయణ, తోలేటి లక్ష్మీనారాయణ, పేరు కృష్ణ, ఆరిమిల్లి చిన్ని, ముస్కుడి రాంబాబు, బొప్పన హరికిషోర్, కడలి గోపాలరావు, పీతల శ్రీనివాస్, చిట్టినాయుడు, నరేష్ పాల్గొన్నారు.

పాలకొల్లు: గత ఐదు సంవత్సరాల్లో డ్రెయిన్లు, పంట కాలువల్లో తట్ట మట్టి తొలగింపు పనులు, మరమ్మతులు లేకపోవడంతో పంటలు ముంపుబారిన పడుతున్నాయని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. సోమవారం మంత్రి పట్టణంలో బెజవాడ కోడు, దమయపత్రి డ్రెయిన్ తవ్వకాలను పరిశీలించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. డ్రెయిన్లు, పంట కాలువల ప్రక్షాళన పనులకు రూ.90 కోట్లు కేటాయించారని, ఆ పనులు సాగుతున్నాయన్నారు.

దళితపేటలో డ్రెయినేజీ నిర్మించాలి

కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతి బాబు

ప్రజాశక్తి - ఉండి

అర్తమూరు గ్రామంలోని దళితపేటలో డ్రెయినేజీలు లేక దళితులు నానా అవస్థలు పడుతున్నారని, తక్షణం డ్రెయినేజీలు నిర్మించాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు డిమాండ్ చేశారు. సోమవారం కెవిపిఎస్ జిల్లా కమిటీ బృందం దళితపేటలో పర్యటించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు మాట్లాడుతూ ఇటీవల కాలంలో కురిసిన భారీ వర్షాల వల్ల అర్తమూరు గ్రామంలో రోడ్లు మొత్తం మురుగునీటితో మునిగిపోయాయని తెలిపారు. డ్రెయినేజీ లేక నీరు నిల్వ ఉండటంతో నడవడానికి కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుధ్య పర్యవేక్షణలో అధికారులు జాప్యం చేస్తున్నారని విమర్శించారు. తక్షణం సంబంధిత అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించడం వల్ల డ్రెయినేజీ వ్యవస్థ, సీసీ రోడ్లు నిర్మాణం వెనకబడ్డాయన్నారు. దళితపేటలో తక్షణం అధికారులు పర్యవేక్షణ చేసి తగు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షులు బత్తుల విజయ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ముంపునకు గురైన గ్రామాల్లో పారిశుధ్య పనులపై అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల కార్యదర్శి మాదాసి గోపి, నాయకులు చిట్టిబాబు అర్తమూరు దళితపేట వాసులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడికి వ్యతిరేకంగా నిరసనలు

ప్రజాశక్తి - పాలకొల్లు

స్వేచ్ఛ, స్వాతంత్రం కోసం పోరాడుతున్న పాలస్తీనా ప్రజలకు రక్షణ కల్పించాలని సిపిఎం నాయకులు దిగుపాటి రాజగోపాల్ డిమాండ్ చేశారు. సోమవారం పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా స్థానిక గాంధీబొమ్మ సెంటర్లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ ఇజ్రాయిల్ పాలస్తీనాపై సామ్రాజ్య దేశాలైన బ్రిటన్, అమెరికా అండదండలతో పాలస్తీనా భూ భాగంలోకి ప్రవేశించి దాడులకు పూనుకుంటోందన్నారు. మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో చల్లా సోమేశ్వరరావు, తిరుమాని శ్రీనివాస్, వేగి రత్తయ్య, జి.వెంకటేశ్వరరావు, కె.రాజారావు, రండి కృష్ణ, ప్రసాద్, టి.గంగరాజు, బి.త్రిమూర్తులు, కె.మురళి, ప్రసాద్ పాల్గొన్నారు.

నరసాపురం : పాలస్తీనాపై ఇజ్రాయిల్ దుర్మార్గ యుద్ధానికి విరామం ప్రకటించాలని పాలస్తీనా సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు ముచ్చర్ల త్రిమూర్తులు, కౌరు పెద్దరాజు మాట్లాడారు. ఇది అత్యంత విషాదకరమని ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణకాండను దుయ్యబట్టారు. ఈ దాడిని ముక్తకంఠంతో ఖండించాలన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నేతలు పొగాకు పూర్ణ, పొగాకు నారాయణరావు, పొన్నాడ రాము, నోముల కొండ, కోడి లక్ష్మణ్, పొన్నాడ మల్లేష్, బుడితి ఇజ్రాయిల్, కె.లక్ష్మి పాల్గొన్నారు.

తణుకులో ర్యాలీ నిర్వహిస్తున్న నేతలు

భీమవరం టౌన్ : పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దుర్మార్గమైన దాడులను అందరూ ఖండించాలి సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వెంప గ్రామంలోని పెద్దపేటలో అంబేద్కర్ విగ్రహం వద్ద పాలిస్తీనా సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో ఇజ్రాయిల్ దాడులను నిరసించింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం సభ్యులు తోటి శుభకరరావు, పట్టం సంజీవి, ఇంజేటి సామ్యూల్, భూషణం, మార్తమ్మ పాల్గొన్నారు.

ఉండి : పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను సిపిఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్ ఖండించారు. ఉండి మెయిన్ సెంటర్లో పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడికి వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ధనికొండ శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కడలి నాగేశ్వరరావు, మజ్జి నాగేశ్వరరావు, వంజరపు సూర్యనారాయణ, నక్కా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తణుకు : పాలస్తీనాపై ఇజ్రాయేలు దాడిని ఆపాలని దారి దీపం సంపాదకులు డివివిఎస్ వర్మ అన్నారు. పాలస్తీనా సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో నరేంద్ర సెంటర్‌లో నిరసన తెలిపారు. అనంతరం ర్యాలీగా బిఎస్ఎన్ఎల్ కార్యాలయం వరకూ వెళ్లారు. ఈ సందర్భంగా డివివిఎస్ వర్మ, సిఐటియు జిల్లా కార్యదర్శి పివి ప్రతాప్ మాట్లాడారు. కార్యక్రమంలో బొద్దాని నాగరాజు, సంకు మనోరమ, పేరూరి మురళీకుమార్, అంబేద్కర్, కడలి రామారావు, రామకృష్ణ పాల్గొన్నారు.

అధికారుల సహాయక చర్యలు అభినందనీయం

ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

15 రోజులుగా తాడేపల్లిగూడెంలో తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు పట్టణ ప్రజలు ఇబ్బంది పడకుండా మున్సిపల్ అధికారులు చేసిన సహాయక చర్యలు అభినందనీయమని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ అధికారులంతా సమిష్టి కృషితో ముంపు ప్రాంతాల్లో చేపట్టిన సహాయక చర్యలతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ మురళీకృష్ణ, మున్సిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

కోడిగుడ్డు, నిమ్మరసంపై అవగాహన

వీరవాసరం:కోడిగుడ్డు, నిమ్మరసం మొక్కల ఎదుగుదలకు పనిచేస్తాయని ప్రకృతి వ్యవసాయ జిల్లా కోఆర్డినేటర్ అరుణకుమారి అన్నారు. నౌడూరు గ్రామంలో కోడిగుడ్డు, నిమ్మరసంపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు కోడిగుడ్డు నిమ్మరసం తయారుచేసి ఎస్‌హెచ్‌జి మహిళలకు, రైతులకు వివరించారు. ఈ సందర్భంగా అరుణకుమారి మాట్లాడుతూ కోడిగుడ్డు, నిమ్మరసం ద్రావణంతో మొక్క ఆరోగ్యంగా పెరిగేందుకు కావాల్సిన ప్రోటీన్లు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జి పి.దేవి నాగరాజు, పి.సర్వేశ్వరరావు, కె.నాగరాజు, జి.నవీన్‌కుమార్, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంకుర పరిశ్రమల అభివృద్ధికి పటిష్ట ప్రణాళిక

తాడేపల్లిగూడెం:అంకుర పరిశ్రమలు అభివృద్ధి చెందాలంటే పటిష్టమైన వ్యాపార ప్రణాళికలు, మార్కెట్ వ్యూహాలు కలిగి ఉండాలని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం విశాఖపట్నం) అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సమీమ్ జావేద్ తెలిపారు. నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ ఎంఎస్ మూర్తి ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్ రెడ్డి పర్యవేక్షణలో ఇనిస్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సౌజన్యంతో ఏంజెల్ ఇన్వెస్ట్‌మెంట్ వీసీ ఫండింగ్ ఆపర్చునిటీ అంశంపై సోమవారం వర్క్ షాప్‌ను ఆన్‌లైన్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి సమీమ్ జావేద్ మాట్లాడారు. కంపెనీలు అభివృద్ధి చెందడానికి, భవిష్యత్తులో విస్తరించడానికి ఈ పెట్టుబడులు ఎంతో కీలకమని తెలిపారు. కార్యక్రమంలో నిట్ డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ జిఆర్‌కె శాస్త్రి అధ్యక్షత వహించగా, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం ఆచార్యులు ఫణికృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

పెన్షనర్ల జీవనజ్యోతి నకారా

భీమవరం ఉప ఖజానా అధికారి రవి వర్మ

ప్రజాశక్తి - భీమవరం

పెన్షనర్ల జీవనజ్యోతి, పెన్షనర్ల జీవితాల్లో వెలుగునింపిన వ్యక్తి డిఎస్ నకారా అని భీమవరం ఉప ఖజానా అధికారి రవివర్మ అన్నారు. స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ భీమవరం శాఖ కార్యాలయంలో నకారా వర్ధంతి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నకారా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవివర్మ మాట్లాడుతూ పెన్షన్ ఉద్యోగికి భిక్ష కాదని, ప్రాథమిక హక్కు అని తెలిపారు. పెన్షన్ సాధించడానికి న్యాయ పోరాటం చేసిన గొప్ప వ్యక్తి నకారా అన్నారు. స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.జేమ్స్ మాట్లాడుతూ 2004 తర్వాత ఉద్యోగ విరమణ చేసిన వారికి కూడా పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు.అసోసియేషన్ భీమవరం శాఖ కోశాధికారి పి.సూర్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి భాస్కరరావు, సభ్యులు సత్యనారాయణ, చంద్రరావు, ముత్యాలరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేత

ప్రజాశక్తి - గణపవరం

విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలని ఎంఇఒ పి.శేషు అన్నారు. సోమవారం స్థానిక జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి కాలేజీ ప్రిన్సిపల్ సిహెచ్ శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షత వహించారు. సమావేశంలో శేషు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులందరికీ ప్రభుత్వం విద్యాభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంటి పరిసరాల్లో నీరునిల్వ లేకుండా చూడాలి

పాలకొల్లు రూరల్:ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చేసుకుంటే దోమల ద్వారా వచ్చే వ్యాధుల నుండి రక్షింపబడతామని లంకలకోడేరు పిహెచ్‌సి వైద్యాధికారి అడ్డాల ప్రతాప్ కుమార్ తెలిపారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి రాజ్ కుమార్, ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు, పిహెచ్‌సిలో ల్యాబ్ వద్ద రికార్డులు పరిశీలించారు. అనంతరం చింతపర్రు గ్రామంలో సచివాలయ సిబ్బందితో జ్వరాలు ప్రబలిన ప్రాంతంలో ఇంటింటా సర్వే చేశారు. జ్వరాలతో బాధపడుతున్న వారి రక్త నమూనాలు సేకరించి, దోమల ద్వారా, కలుషిత నీటి ద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం అనిత, హెల్త్ అసిస్టెంట్ తారకసత్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చేనేత బజార్లు ఏర్పాటు చేయాలి

పెనుమంట్ర:రాష్ట్ర ప్రభుత్వం చేనేతను ఆదుకోవడానికి గాను ప్రతి నియోజకవర్గంలోనూ చేనేత బజార్లు ఏర్పాటుచేసే విధంగా జిఒ ఇవ్వాలని జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు అల్లాడ సూర్య భాస్కరరావు కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం రోజున గత ప్రభుత్వం నేతన్న నేస్తం ప్రవేశపెట్టిందని, ప్రస్తుతం జాతీయచేనేత దినోత్సవం సందర్భంగా అదే విధంగా ప్రస్తుత ప్రభుత్వం చేనేత బజార్లు ఏర్పాటు చేయాలన్నారు.

సిపిఎం వార్డు సభ్యురాలు లక్ష్మీ మృతి పట్ల సంతాపం

యలమంచిలి:కట్టుపాలెం గ్రామానికి చెందిన సిపిఎం మండల కమిటీ సభ్యులు అంబటి రంగనాయకులు భార్య, సిపిఎం వార్డు మెంబర్ అంబటి లక్ష్మి మృతికి పలువురు నేతలు సంతాపం తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు, సిపిఎం సీనియర్ నాయకులు వలవల శ్రీరామ్మూర్తి, కేతా సూర్యారావు, ప్రముఖ న్యాయవాది పూరిళ్ల శ్రీనివాస్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బాతిరెడ్డి జార్జి, సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు, కెవిపిఎస్ నాయకులు ఇంజేటి శ్రీనివాస్, గొల్ల ఏడుకొండల శ్రీనివాస్ సిఐటియు నాయకులు దేవ సుధాకర్, కౌలు రైతు సంఘం నాయకులు సుబ్బారావు, జార్జి బాబు ఉన్నారు.

దుండగులను శిక్షించాలి

మొగల్తూరు: మండలంలోని పేరుపాలెం బీచ్‌లో ఉన్న ఎంఆర్‌పిఎస్ స్తూపాన్ని ధ్వంసం చేసిన దుండగలను తక్షణం శిక్షించాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలం శ్రీను సోమవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళితుల ఉద్యమాలను, ఆత్మ గౌరవాన్ని కించపర్చేలా స్తూపాన్ని ధ్వంసం చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. దుండగలన పట్టుకుని వెంటనే శిక్షించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

నూతన టెక్నాలజీతోనే ఉద్యోగావకాశాలు

భీమవరం టౌన్:నూతన టెక్నాలజీ అధ్యయనంతోనె ఉద్యోగావకాశాలు అందుకోగలరని బోధ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ పృథ్వీతేజ్ తెలిపారు. ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు 'కాంపిటేటివ్ కోడింగ్' అంశంపై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. సోమవారం జరిగిన ప్రారంభ కార్యక్రమానికి సిఎస్‌సి హెడ్ డాక్టర్ వి.చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పృథ్వీతేజ్ మాట్లాడుతూ కాంపిటేటివ్ కోడింగ్‌లో నూతన అంశాన్ని ఛాలెంజ్‌గా తీసుకొని తక్కువ సమయంలో దాన్ని పరిష్కరించవచ్చున్నారు. కళాశాల ప్రిన్సిపల్ కెవి.మురళీకృష్ణంరాజు, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ హెడ్ చంద్రశేఖర్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎఐఎంఎల్ కోఆర్డినేటర్ డాక్టర్ జిఎన్‌వి జి.శిరీష, ఎఎల్.లావణ్య, పి.సరోజ పాల్గొన్నారు.

ఆరెకరాల్లో దెబ్బతిన్నాయ్ : ఎఒ



పెనుగొండ: మండలంలో సార్వా సాగుకు సంబంధించి వరి నాట్లు మొదటి దశలోనే వర్ష ప్రభావంతో నీటమునిగాయని మండల వ్యవసాయ అధికారి పి.స్పందన తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మండలంలోని 12076 ఎకరాలు సాగుచేపట్టారు. ఆరు ఎకరాల్లో ఆకుమడులు దెబ్బతిన్నాయని తెలిపారు. కొట్టాలపర్రు నక్కల డ్రెయిన్ ఏరియాలో 46 ఎకరాల్లో మురుగు నీరు ప్రభావంతో నీటమునిగి నష్టం వాటిల్లిందన్నారు. మురుగునీరు కాలువల గురించి సంబంధిత రెవెన్యూ అధికారులకు వివరించిన వెంటనే సమస్యను పరిష్కరించడంతో వరి నాట్లకు పెద్ద నష్టం లేదని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం

పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి

ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190

పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

సమస్యలు పరిష్కరించాలని రైల్వే గూడ్స్ షెడ్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం టౌన్

తాడేపల్లిగూడెం టౌన్: వినతిపత్రం అందజేస్తున్న నేతలు

రాష్ట్ర వ్యాప్తంగా సిఐటియు ఇచ్చిన పిలుపులో భాగంగా తాడేపల్లిగూడెం రైల్వే గూడ్స్ షెడ్ వర్కర్స్ యూనియన్ రైల్వే స్టేషన్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం స్టేషన్ మాస్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సత్తి కోదండరామిరెడ్డి, చిర్ల పుల్లారెడ్డి, సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, నాయకులు కరెడ్ల రామకృష్ణ మాట్లాడారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2014 నుంచి రైల్వేను ప్రయివేటుపరం చేయడం వల్ల రైల్వే గూడ్స్ షెడ్‌లో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కరువైందని తెలిపారు. దశాబ్దాల తరబడి రైల్వే గూడ్స్ షెడ్ వద్ద పనిచేస్తున్న కార్మికులకు ఇప్పటివరకూ పిఎఫ్, ఇఎస్ఐ, గుర్తింపు కార్డులు ఇవ్వలేదని, వారు వయసు మీరిన తర్వాత వట్టి చేతులతో ఇంటికి వెళ్లిపోయే పరిస్థితి కార్మికులకు దాపురించిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం గూడ్స్ షెడ్‌లో పనిచేస్తున్న కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించి గుర్తింపు కార్డులు, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా విభజించిందని, ఈ నాలుగు కోడ్లను రద్దుచేసి గత కార్మిక చట్టాలను తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కర్రి సాయిరెడ్డి, కర్రి శ్రీనివాస్‌రెడ్డి, అడప ఆంజనేయులు, బుద్దాల నాని, మద్దాల పుత్రయ్య, సుబ్బిరెడ్డి, గాది వెంకటరావు, ఆకుల నారాయణ, ఎ.కృష్ణ పాల్గొన్నారు.

ఆకివీడు : కేంద్రంలో ఉన్న బిజెపి కార్మిక కర్షక ప్రజావ్యతిరేక విధానాల వల్ల కాంట్రాక్ట్ డైలీ వేజ్ కార్మికులు కష్టాల్లో బతుకుతున్నారని సిఐటియు మండల కార్యదర్శి కె.తవిటి నాయుడు తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక రైల్వే స్టేషన్ గూడ్స్ కార్మికులు గూడ్స్ షెడ్ వద్ద ధర్నా చేసి షెడ్ అధికారి సిసిఆర్ఎస్.నందీశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు వెంకి అప్పారావు అధ్యక్షతన జరిగిన సభలో కవిటి నాయుడు మాట్లాడారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నిమ్మల శీను, వేల్పూరి త్రిమూర్తులు, పీతల శ్యామ్ పాల్గొన్నారు.

వరద బాధితులకు కూటమి ప్రభుత్వం అండ

ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వరద బాధితులకు కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎర్రకాలువ వరద ముంపులో నిరాశ్రయులైన బాధితులకు ప్రభుత్వం తక్షణ సాయం కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రస్తుతం తక్షణ సాయంగా ప్రతి కుటుంబానికీ రూ.3,000, బియ్యం, నిత్యావసర సరుకులు అందిస్తున్నామని త్వరలోనే రైతులందరికీ తగు సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న బాధితులను ఆదుకోవాల్సిన తక్షణ కర్తవ్యం కూటమి ప్రభుత్వంపై ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అభిప్రాయ పడుతున్నారన్నారు. కూటమి నాయకులు వరద బాధితులకు అండగా ఉండాలన్నారు. ప్రతిపక్ష నేత కొట్టు సత్యనారాయణ వరద బాధితులను పరామర్శించేందుకు వచ్చి కనీస సాయం అందించకపోగా కూటమి ప్రభుత్వంపై విమర్శలకు దిగడం దారుణమన్నారు. అనంతరం మండలంలోని జగన్నాథపురం, మారంపల్లి, ఆరుళ్ల, నందమూరు గ్రామాల్లో బాధితులకు సాయం అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ మురళీకృష్ణ, ఎంపిడిఒ ఎస్-ఎస్.శర్మ, మండల అధ్యక్షులు అడపా ప్రసాద్ పాల్గొన్నారు.

మహిళలు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

నేటి సమాజంలో మహిళలు రాణించాలంటే మానసికంగా, శారీరకంగానూ దఢంగా ఉండాలని భీమవరం ఐసిడిఎస్ సిడిపిఒ టి. లక్ష్మీకాంతం అన్నారు. సోమవారం స్థానిక రాయలంలో ఉన్న కోడ్ నెంబర్ 235 అంగన్వాడీ సెంటర్లో మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు మరింత అవగాహన తెచ్చుకోవాలని ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. యుక్త వయసు నుండే బాలికలకు కూడా రక్తహీనత లోపం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అనిల్ కుమారి, ప్రాజెక్ట్ లీడర్ సిహెచ్ మహాలక్ష్మి పాల్గొన్నారు.

పెనుగొండ : మిషన్ శక్తి వంద రోజుల ప్రాజెక్టులో భాగంగా మహిళలకు కొత్త చట్టాలపై ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రూతు కుమారి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం సిద్ధాంతం పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించారు. అనంతరం రూతు కుమారి మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

మొగల్తూరు : ప్రతి ఒక్కరూ తమ హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని సిడిపిఒ బి.ఊర్మిళ సూచించారు. మొగల్తూరు పంచాయతీ పరిధి కొండావారిపేటలో, ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం సోమవారం మిషన్ శక్తి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీలకు చిన్నారుల తల్లిదండ్రులకు హక్కులు, ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రదర్శన చేశారు. సూపర్‌వైజర్ పి.విజయకుమారి, మహిళా పోలీస్‌లు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యలమంచిలి : పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని కెఎపాలెం సర్పంచి ఆకుల సూర్యనారాయణ అన్నారు. సోమవారం గ్రామంలో జరిగిన మిషన్ శక్తి అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడారు. అంగన్‌వాడీల ఆధ్వర్యంలో గ్రామంలో మిషన్ శక్తి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం వల్ల గ్రామస్తులకు అనేక విషయాలపై అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

ఆచంట : శిశు అభివృద్ధి ఫలితాల్లో మెరుగుదలను వేగవంతం చేయడానికి వందరోజుల మిషన్ శక్తి కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సూర్య కుమారి అన్నారు. ఆచంట వేమవరంలో వందరోజుల మిషన్ శక్తి కార్యక్రమం అంగన్వాడీల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. సూర్య కుమారి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచి జక్కంశెట్టి చంటి, పంచాయతీ కార్యదర్శి పి.చంద్రశేఖరరావు, ఎఎన్ఎం రాజకుమారి, ఎంఎల్ఎల్ హెచ్‌పి రీనా, మహిళా పోలీస్ సుబ్బలక్ష్మి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షా సప్తాహ్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

బాలల్లో దేశభక్తి, స్వతంత్ర, జాతీయ సమైక్యతా భావాలు కలిగించేవి కేంద్ర ప్రభుత్వ పథకమైన శిక్షా సప్తాహ్ అని బిజెపి నాయకులు, అరసవల్లి ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు అరసవల్లి సుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అరసవల్లి ఛారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో 5 ప్రభుత్వ పాఠశాలలో శిక్షా సప్తాహ్ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించి బాలలకు భోజనాలు, స్వీట్స్ పండ్లు పంపిణీ చేశారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. అనంతరం పసిమొగ్గల ప్రాథమిక పాఠశాల, ఆర్‌హెచ్‌ఎం, అడబాల చంద్రరావు, ఆర్‌సిఎం ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు భోజనాలు, స్వీట్స్, అరటిపళ్లు పెట్టారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ, పాఠశాల హెచ్‌ఎం మావూళ్ళ, సాయికుమార్ పాల్గొన్నారు.

వీరవాసరం : మండలంలోని పలు పాఠశాలలో శిక్ష సప్తాహ్ కార్యక్రమం నిర్వహించారు. వారం రోజుల పాటు నిర్వహించే కార్యక్రమంలో మొదటిరోజు దాతల సహకారంతో మధ్యాహ్న భోజనానికి అదనపు పోషకాలు అందించే విధంగా విద్యార్థులకు తిథి భోజనాలు, గ్రామస్తులతో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. రాయకుదురు హైస్కూల్ ప్లస్ వద్ద ఉపాధ్యాయుడు అంగర వేణు ఆర్థిక సహకారంతో అరటి పండ్లు, మత్స్యపురి ప్రాథమిక పాఠశాల వద్ద దాత ఆకుల లీలాకృష్ణ సహాయంతో స్వీట్లు, పెరుగు సమకూర్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.శ్రీనివాసరావు, ఎంవిడి.భవానీ, ఎఇఒ రాజేష్, విద్యా కమిటీ ఛైర్మన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

మొగల్తూరు : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టిన శిక్ష సప్తాహ్ తిది భోజన కార్యక్రమాన్ని మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పేరుపాలెంసౌత్‌లో ప్రాథమిక పాఠశాల, కొమ్మూరి సతీష్ మెమోరియల్ జెడ్‌పి ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు పాఠశాల హెచ్‌ఎం నక్క ఉమాకుమారి పర్యవేక్షణలో గ్రామానికి చెందిన సత్తినేని త్రిమూర్తులు స్వీట్స్, అందే సతీష్ పండ్లు పంపిణీ చేశారు. గుండు సుబ్బారావు పెరుగు సమకూర్చి విద్యార్థులకు వడ్డించారు.

గణపవరం : ఈ నెల 22 నుంచి 29వ తేదీ వరకూ గణపవరం జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్లో జరిగిన శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు సోమవారంతో ముగిసి నట్లు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.బాల భాస్కరరావు తెలిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు స్థానిక వ్యాపారి బోడ్డు వరప్రసాద్ పాసయం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : శిక్ష సప్తాహ ముగింపు కార్యక్రమంలో భాగంగా తిథి భోజనం కార్యక్రమంలో పెదతాడేపల్లి సర్పంచి పోతుల అన్నవరం పాల్గొని విద్యార్థులకు భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి-2 వీర వెంకట సత్యనారాయణ, విద్యార్థుల తల్లిదండ్రులు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. టిడిపి మండల అధ్యక్షులు పరిమి రవికుమార్ చినతాడేపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.

పాలకొల్లు : పాలకొల్లులోని జివిఎస్‌వి ఆర్‌ఎం మున్సిపల్ పాఠశాలలో శిక్ష సప్తాహలో భాగంగా సోమవారం ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంఇఒ ఆర్ఎన్‌విజిఎస్.శర్మ మాట్లాడారు. అనంతరం రూరల్ లయన్స్ క్లబ్ రీజియన్ కోఆర్డినేటర్ డాక్టర్ సంగినీడి వెంకట రంగారావు, రాయపూడి భవాని ప్రసాద్ ఆర్థిక సహకారంతో విద్యార్థులకు, తల్లిదండ్రులకు పండ్లు, స్వీట్లు, పులిహోర, పలావ్ తదితర వంటకాలతో సహ పంక్తి భోజనాలు పెట్టారు. కార్యక్రమంలో కరణం పాపారావు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిఒ 85ను రద్దు చేయాలి

కలెక్టర్‌కు పిహెచ్‌సి వైద్యుల సంఘం వినతి

ప్రజాశక్తి - భీమవరం

జిఒ 85ను రద్దు చేసి, ఇన్ సర్వీస్ కోట 35 శాతం, నాన్ క్లినికల్ 50 శాతం కొనసాగించాలని పిహెచ్‌సి వైద్యుల సంఘం ప్రతినిధులు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణికి కలెక్టరేట్లో సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైద్యుల సంఘం జాయింట్ సెక్రటరీ డాక్టర్ కిషోర్, డాక్టర్ రంగం నాయుడు, సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ పిహెచ్ ఆర్.సంతోష్ మాట్లాడారు. వైద్యులకు నష్టం చేకూర్చే జిఒ 85ను రద్దు చేయాలన్నారు. మారుమూల గ్రామాల్లో నివాసమంటూ వైద్య సేవలందిస్తున్న వైద్యులకు అన్యాయం జరుగుతోందన్నారు. జిఒను పున:సమీక్షించాలని కోరారు. అనంతరం జిల్లా వైద్య శాఖ అధికారి మహేశ్వరరావుకు వినతిపత్రాన్ని అందజేసి సమస్యలు విన్నవించారు.

విద్యా పథకాలకు మహనీయుల పేర్లు హర్షణీయం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జాతి చైతన్యానికి స్ఫూర్తి కూటమి ప్రభుత్వమని, రాష్ట్ర విద్యా పథకాలకు మహనీయుల పేర్లు పెట్టడం మంచి సాంప్రదాయమని పలువురు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో యూత్ హాస్టల్స్ అసోసియేషన్, లయన్స్ క్లబ్, యల్లా ప్రగాఢ సుబ్బారావు జయంతి కమిటీ సహకారంతో సంస్కార్ స్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ విద్య పథకాలకు మహనీయుల పేర్లు పెట్టడం గొప్ప విశేషమన్నారు. పథకాలకు ఎందరో త్యాగధనుల పేర్లు పెట్టడం స్ఫూర్తినిస్తుందన్నారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, లయన్స్ క్లబ్ జిల్లా కో ఆర్డినేటర్ నందమూరి రాజేష్, ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ, యూత్ హాస్టల్స్ జిల్లా కార్యదర్శి మాట్లపూడి సత్యనారాయణ, కొండ్రు శ్రీనివాస్, అడపా సత్యవతి పాల్గొన్నారు.

అనధికార మీటర్ల తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

భీమవరం టౌన్:బస్ షెల్టర్‌కు అనాధికారిక విద్యుత్ కలెక్షన్లు శీర్షికన ప్రజాశక్తి పత్రికలో ప్రచురితమైన కథనంపై భీమవరం సబ్ డివిజన్ కార్యాలయం అధికారులు స్పందించారు. రంజాన్ సమయంలో హలీం వ్యాపారస్తులకు విద్యుత్ శాఖ నిబంధన ప్రకారం సరైన పత్రాలు లేకుంటే నాలుగు సార్లు అధిక సెక్యూరిటీ డిపాజిట్ కట్టించుకొని ఇస్తామన్నారు. దీనిపై ఎవరినైనా అభ్యంతరాలు తెలిపితే తొలగిస్తామన్నారు. ఈ నిబంధన ప్రకారం మార్చిలో భీమవరపు పెద్దిరాజు పేరుమీద ఒక సర్వీసు, మహమ్మద్ వసీమ్ మరో సర్వీసు ఇచ్చినట్లు తెలిపారు. అయితే అప్పటి నుండి సిసి ఛార్జీలు చెల్లించనందున గత నెల ఆరో తేదీన కలెక్షన్లు తొలగించినట్లు తెలిపారు. ప్రజాశక్తి వార్త కథనంతో మీటర్లను పూర్తిస్థాయిలో తొలగించామని మంగళవారం విద్యుత్ శాఖ డిఇ కార్యాలయం వివరణ ఇచ్చారు.

అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలి

తణుకు:మనుషులను అక్రమ రవాణా చేసి వారి శరీర అవయవాలతో వ్యాపారం చేస్తున్నారని, అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని న్యాయవాదులు అన్నారు. సోమవారం స్థానిక 8వ వార్డులోని సచివాలయం వద్ద ఉన్న అంగన్‌వాడీ సెంటర్లో ఛైర్మన్, నాలుగో అదనపు జిల్లా జడ్జి సత్యవతి ఆదేశాల మేరకు తణుకు బార్ అసోసియేషన్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా వల్ల ఎక్కువగా పిల్లలు నష్టపోతున్నారన్నారు. చిన్న పిల్లలను జాగ్రత్త గా కాపాడుకోవాలన్నారు. గ్రామాల్లో పెద్ద వారికి చట్టాలపై అవగాహన కల్పించే బాధ్యత అంగన్‌వాడీ టీచర్లకు ఉందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కౌరు వెంకటేశ్వర్లు, కామన మునిస్వామి, పారాలీగల్ వాలంటీర్లు కె.నాగమల్లేశ్వరి, వెంకటగిరి పాల్గొన్నారు.

వేల్పూరు సమస్యలు పరిష్కరించాలని సిపిఎం వినతి

ప్రజాశక్తి - తణుకు

మండలం వేల్పూరులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని సిపిఎం వేల్పూరు గ్రామ కమిటీ కోరింది. సోమవారం శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణను తణుకు పార్టీ కార్యాలయంలో సిపిఎం వేల్పూరు కమిటీ బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. అనంతరం ఎంఎల్ఎకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం గ్రామ కమిటీ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు మాట్లాడుతూ గ్రామంలో మినీ బైపాస్ రోడ్డు మార్గంలో భారీ వాహనాలు స్పీడ్‌గా నడపడం వల్ల రాత్రి సమయంలో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. దీనికితోడు కొంతమంది ఆకతాయిలు మత్తు పదార్థాలు సేవించి చీకటిలో వాహనదారులను అడ్డగించి వారిని బెదిరించి బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నారని గ్రామంలో ప్రచారం జరుగుతోందన్నారు. ఈ మార్గంలో నాలుగు చోట్ల జంక్షన్లు ఉన్నాయని, ఎటువంటి సిగ్నల్ లైట్లు లేకపోవడం వల్ల తరచూ ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. రోడ్డు పొడవునా విద్యుత్ స్తంభాలు, లైట్లు వేయాలని కోరారు. గ్రామంలో ఎంపియుపి స్కూల్ నుంచి రైల్వే స్టేషన్ వయా మండపాక ఎర్రనీలి గుంట వెళ్లే వంతెన వరకూ రహదారి పెద్ద పెద్ద గోతులతో అధ్వానంగా ఉందన్నారు. రోడ్డుకు శాశ్వత నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. గ్రామంలో గోస్తని కాలువ ఆధునికీకరణ పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పార్టీ శాఖా కార్యదర్శులు వాసా వెంకటేశ్వరరావు, తిరునాథం వెంకటేశ్వరరావు, కర్ణాటపు నరసింహారావు, కుడకా వీరభద్రరావు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం

అంబేద్కర్ ఆలోచన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భరత్ కుమార్

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం నియోజకవర్గంలోని పలు ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు కండిషన్‌లో లేని బస్సులను నడుపుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని, వాటిపై రవాణా శాఖ అధికారులు దాడులు చేసి పిల్లల ప్రాణాలను కాపాడాలని అంబేద్కర్ ఆలోచనా వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చవ్వాకుల భరత్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక మాలమహానాడు జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. భీమవరం పట్టణంతో పాటు జిల్లాలో పాలకొల్లు, నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల్లో పలు ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు కండిషన్‌లో లేని బస్సులను నడుపుతూ బస్సు ఫీజులను విపరీతంగా పెంచేస్తున్నారని తెలిపారు. ప్రయివేట్ స్కూల్ బస్సులు నడుపుతున్న కొంతమంది డ్రైవర్లు మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపుతున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయన్నారు. జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమై విద్యార్థుల బంగారు భవిష్యత్‌ను కాపాడాలని కోరారు.

రైతులను ఆదుకుంటాం : పితాని

ఆచంట:నక్కల డ్రెయిన్ ఉధృతికి పంట పొలాలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. సోమవారం సాయంత్రం వల్లూరు పంచాయతీ పరిధి మట్టావానిచెరువు ప్రాంతంలో ముంపునకు గురైన నారుమడులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ప్రభుత్వం ఆదుకోవాలని ఆయనను కోరారు. రైతులు అధైర్య పడొద్దని, ఇప్పటికే ప్రభుత్వం ముంపు ప్రాంతాలకు మంత్రుల బృందాన్ని పంపించి నష్టాలను అంచనా వేస్తుందని త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులకు శుభవార్త చెబుతారని అన్నారు. ఆయన వెంట జెడ్‌పిటిసి ఉప్పరపాటి సురేష్ బాబు, ఎంపిపి దిగుమర్తి సూర్యకుమారి, మండల అధ్యక్షుడు కేతా మీరయ్య పాల్గొన్నారు.అలాగే అయోధ్యలంక, అనగార్లలంక, కోడేరులంక, భీమలాపురం వరద ముంపు ప్రాంతాలలో ఆయన పర్యటించి బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం తక్షణ సాయంగా 25 కేజీల బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ పిచ్చయ్య, తహశీల్దార్ ఐపి శెట్టి, ఎంపిడిఒ పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి - నరసాపురం

కొత్త నవరసపురం గ్రామంలో ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ సోమవారం పర్యటించారు. గోదావరి వరద ముంపు కారణంగా ఇబ్బందులు పడుతున్న ప్రజలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి నిత్యావసర వస్తువులు పంపిణీ చేసి ప్రభుత్వం తరపున అండగా ఉంటామని భరోసా కల్పించారు.

చిరు, పవన్ అభిమానుల సంఘం మండల అధ్యక్షునిగా కృష్ణాజీ

ప్రజాశక్తి - మొగల్తూరు

చిరు, పవన్ అభిమానుల సంఘం మండల అధ్యక్షుడిగా దాసరి కృష్ణాజీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చిరు, పవన్ అభిమానుల కమిటీని సోమవారం మొగల్తూరులో జిల్లా అధ్యక్షుడు కోపల్లె శ్రీను అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడిగా కృష్ణాజీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అభిమానులు కృష్ణాజీని ఘనంగా సత్కరించారు. కార్యక్రమాల్లో పోలిశెట్టి సత్తిబాబు, సాంబ, లక్కు, బాబి, బొక్క చంటి పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

ఏలూరు జిల్లా, ఉంగుటూరు మండలం, కైకరం గ్రామ నివాసి మెండి వెంకటలక్ష్మీ, W/o మెండి దుర్గాప్రసాద్ అను నేను ది.25-07-2024వ తేదీన కైకరం నుండి ఉంగుటూరు వెళ్ళుచుండగా మార్గ మధ్యలో నా యొక్క పాస్‌పోర్టు పోయినది. నా ఒరిజినల్ పాస్‌పోర్టు నెం: X1037239 కావున నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన ఎడల ఈక్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

మెండి వెంకటలక్ష్మీ
W/o: మెండి దుర్గాప్రసాద్
కైకరం, ఉంగుటూరు మండలం
Mobile: 8886555198

పత్రికా ప్రకటన
మహారాజశ్రీ భీమవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S.No.134/2021

వాది : నందమూరి పార్వతి
ప్రతివాదులు : బొబ్బనపల్లి అప్పారావు వగైరా
8వ ప్రతివాది : బొబ్బనపల్లి రూప, D/o.అప్పారావు, R/o.తోకలపూడి, వీరవాసరం మండలం, ప.గో.జిల్లా.
10వ ప్రతివాది : బొబ్బనపల్లి నానిబాబు, S/o.అప్పారావు, తోకలపూడి, వీరవాసరం మండలం, ప.గో.జిల్లా.

పై నెంబరు దావా గ్రంథము నందు మీ యొక్క హాజరు నిమిత్తము సమన్లు మీ అడ్రసుకు అనేక పర్యాయములు కోర్టు ద్వారాను, రిజిష్టర్ పోస్ట్ ద్వారాను పంపించినను వాటిని మీరు అందుకొని వుండుట లేదు. అందువలన మీరు **ది.08-08-2024** సం.రం. తేదీన ఉదయం 10 గంటల 30 నిమిషములకు స్వయముగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరై పై కోర్టు వారి ఎదుట మీ ఆక్షేపణలు తెలియపరచు కొనవలెను. అట్లు హాజరు కానిచో మీ పరోక్షములో సదరు దావా తీర్మానించబడునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

భీమవరం, **కె.వి.రమేష్,** పెన్నాడ.
27-7-2024 వాది తరపు న్యాయవాది.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.No.25/2022 in O.S.No.188/2015

DHR/వాది : ముత్యాల ఏడుకొండలు
JDR/ప్రతివాది : చామర్తి కోదండరామ కనకదుర్గ వరప్రసాద్ గుప్త
JDR/ ప్రతివాది : చామర్తి కోదండరామ కనకదుర్గ వరప్రసాద్ గుప్త, S/o.పెద్దకేశవరావు, డోరునెం.2-29-2, ఉప్పులూరు, ఉండి మండలం, ప.గో.జిల్లా.

పై నెంబరు దావా నందు మీ యొక్క హాజరు నిమిత్తము సమన్లు మీ అడ్రసుకు అనేక పర్యాయములు కోర్టు ద్వారాను, రిజిష్టర్ పోస్ట్ ద్వారాను పంపించినను వాటిని మీరు అందుకొని వుండుట లేదు. అందువలన మీరు **ది.20-08-2024** సం.రం. తేదీన ఉదయం 10 గంటల 30 నిమిషములకు స్వయముగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరై పై కోర్టు వారి ఎదుట మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. అట్లు హాజరు కానిచో మీ పరోక్షములో సదరు దావా తీర్మానించబడునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

భీమవరం, **కె.వి.రమేష్,** పెన్నాడ.
27-7-2024 వాది తరపు న్యాయవాది.

మహారాజశ్రీ భీమవరం సెకండ్ అడిషనల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
O.S.No.233/2022

Between:
తాటిపట్టి వెంకటేశ్వర్లు ...వాది
And
తాటిపట్టి వెంగప్ప వగైరా ...ప్రతివాదులు
2వ ప్రతివాది : శ్రీమతి తాటిపట్టి నాగమ్మ, భర్త : లేటు నాగులు, వయస్సు 60 సం.లు, హిందు, స్త్రీ, కూనవరం గ్రామం, తాడేపల్లిగూడెం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా. TCJ(Jr.D.)Court.
4వ ప్రతివాది : శ్రీమతి బోదనపు వరలక్ష్మి అనే బుజ్జి, భర్త: మురళీకృష్ణ, తండ్రి: లేటు నాగులు, వయస్సు 32 సం.లు, హిందు, స్త్రీ, కూనవరం గ్రామం, తాడేపల్లిగూడెం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా. TCJ(Jr.D.)Court.
వాది తరుపున దాఖలు చేసిన పత్రికా ప్రకటన

పై నంబరు దావాలో వాది పలుమార్లు కోర్టు ద్వారా మీకు సమన్లు పంపినను మీరు ఉద్దేశ్యపూర్వకంగా నిరాకరించినందున ఈ పత్రిక ప్రకటన ద్వారా నోటీసు ప్రకారము అమలు చేయటమైనది. కావున, మీరు పై కోర్టు వారి యెదుట **ది.13-8-2024** ఉదయం 10.30 గంటలకు స్వయంగా గాని, ప్లీడర్ గారి ద్వారా గాని హాజరయ్యి పై దావా గ్రంథంలో మీ సమాధానం తెలియజేయవలెను. లేని యెడల, మీపై శ్రీకోర్టు వారు పరోక్షముగా ఉత్తర్వులు జారి చేసి తీర్మానము చేయుదురు అని ఇందుమూలముగా మీకు తెలియజేయటమైనది.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల మేరకు ఈ పపర్ ప్రకటన ఇవ్వటమైనది)

భీమవరం, **కోటి వెంకట్రామయ్య,**
ది.29-07-2024 అడ్వకేట్, కాళ్ళ
సెల్: 9849356865.